క్లుప్తంగా

పనుల పరిశీలన

నందిగామటౌన్: పట్టణ ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి తెలిపారు. మున్సిపల్ అధికారులతో కలిసి సోమవారం ఆమె నందిగామ పట్టణంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న ప్రధాన తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలించారు. ఈసందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీరు సరఫరా కాని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాస్, రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వెండి గంట సమర్పణ



చిట్టేల(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణంకు చెందిన నల్లాని కృష్ణమాచార్యులు, రమాదేవి దంపతులు కేజీన్నర బరువున్న రూ.1,60లక్షలు విలువగల వెండి గంటను సోమవారం సమర్పించారు. ఈసందర్భంగా దాతకు అర్చకుడు సిరికొండ సాయి కృష్ణమాచర్యులు తదితరులు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదాలు అందించి సత్కరించారు.

జాతీయ సదస్సుకు ఎంపిక

నందిగామటౌన్: హర్యానాలోని గురుగ్రామ్‌లో ఈనెల మూడోతేదీ నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి సదస్సులో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొననున్నట్లు కమిషనర్ లోవరాజు సోమవారం తెలిపారు. ఈ మేరకు పలువురు మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లను ఎంపికచేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అందులోభాగంగా నందిగామ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారికి కూడా అవకాశం దక్కిందని కమిషనర్ వివరించారు.

ఉద్యోగికి సత్కారం



పెనుగంచిప్రోలు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ చేసిన చాపల లక్ష్మయ్యను ఎంపీడీవో జి.శ్రీను, డెప్యూటీ ఎంపీడీవో కె.సుబ్బారావు ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏవో సిద్ధారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డివిజన్‌లో 92.4 మి.మీ వర్షపాతం

నందిగామ రూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో ఆదివారం రాత్రి 92.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు డివిజనల్ ఉపగణాంకాధికారి ప్రసాద్ సోమవారం తెలిపారు. నందిగామ నియోకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 35.2 మి.మీ వర్షం కురవగా, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 57.2 మి.మీ వర్షం కురిసినట్లు వివరించారు. వత్సవాయి మండలంలో అత్యధికంగా 25.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. నందిగామ మండలంలో 6.6 మి.మీ, కంచికచర్ల మండలంలో 9.2 మి.మీ, చందర్లపాడు మండలంలో 5.2 మి.మీ, వీరులపాడు మండలంలో 14.2 మి.మీ, జగ్గయ్యపేట మండలంలో 16.8 మి.మీ, పెనుగంచిప్రోలు మండలంలో 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆయన వివరించారు.

అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

నందిగామటౌన్: పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పేర్కొన్నారు. పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక టేబుల్ అజెండాతోపాటు అజెండాలోని 27 అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మున్సిపల్ కమిషనర్ లోవరాజు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు పాకాలపాటి కిరణ్, ఓర్సు జ్వాలా, కౌన్సిల్ సభ్యులు షేక్ యాకుబ్ అలీ, షేక్ ఖాలిక్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు):ఉపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ నక్కా కమల సూచించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆమె యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోపి కాంత్, మునేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొన్నం బాలాజీ, ఎస్ఎంసీ చైర్మన్ ఊటుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీపై కూటమి నిర్లక్ష్యం



సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కంచికచర్ల జగనన్న కాలనీ



కాలనీలో దర్శనమిస్తున్న ముళ్లపొదలు

- సమస్యలతో కాలనీవాసులు సతమతం...
- తాగునీటికి తప్పని అవస్థలు
- అధ్వానంగా ఉన్న రోడ్లు
- ఏడాదిగా పట్టించుకోని ప్రభుత్వం
- వసతులు కల్పించాలంటూ ఆందోళన

కంచికచర్ల: కంచికచర్లలోని జగనన్నకాలనీ నెలకొన్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీకి మౌలికవసతులు కల్పించాలని పలుమార్లు పాలకులకు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు.

567మందికి ఇళ్ల స్థలాలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వహయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంచికచర్లలో జగనన్నకాలనీ ఏర్పాటు చేసి 567మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. విద్యుత్ సదుపాయం కల్పించారు లబ్ధిదారులకు పక్కాగృహాలు కూడా మంజూరు చేయడంతో వీరిలో 187మంది ఇళ్లు నిర్మించుకుని తమ సొంతింటి కలను నెరవేర్చుకున్నారు. 2024 మే నెలలో సార్వత్రిక ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం ఏర్పడగా, ఈ ఏడాది కాలంలో జగనన్న కాలనీ అభివృద్ధికి పాలకులు తీసుకున్న చర్యలు శూన్యం. పట్టణానికి దూరంగా ఉన్న జగనన్నకాలనీకి రోడ్డు, మంచినీరు, డ్రైనేజీ వంటి కనీస మౌలికవసతులు కల్పించే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కొందరు కాలనీవాసులు ఇళ్లు ఖాళీ చేసి తిరిగి కంచికచర్లలో అద్దె ఇళ్లలో చేరుతున్నారు.

అధ్వానంగా ఉన్న రోడ్లు...

కంచికచర్ల పట్టణంలోని జగనన్న కాలనీలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా మారాయి. వర్షాకాలంలో కాలనీ నుంచి సెంటర్‌కు వెళ్లేందుకు కూడా వీలులేని పరిస్థితి. వర్షాకాలంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు కూడా అవకాశం లేక విద్యార్థులు కూడా ఇళ్లవద్దనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఏడాదిగా మౌలికవసతులు కల్పించకపోవడంతో మిగిలిన స్థలాలవారు కూడా ఇక్కడ ఇళ్లు నిర్మించుకునేందుకు ధైర్యం చేయలేకపోతున్నారు.

కంచికచర్ల వెళ్తేనే రేషన్ సరుకులు..

కాలనీలో రేషన్‌దుకాణం లేకపోవడంతో కాలనీవాసులంతా రెండు కిలోమీటర్ల దూరంలోని కంచికచర్ల వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారులకు ఇళ్లవద్దనే రేషన్ సరుకులు అందగా, ఆయా వాహనాల రద్దుతో కాలనీవాసులు రేషన్ సరుకుల కోసం గత నెల నుంచి కంచికచర్ల వెళ్లక తప్పడం లేదు.



అధ్వానంగా ఉన్న కంచికచర్ల నుంచి జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డు

సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన ..

కాలనీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ కాలనీవాసులు సోమవారం రోడ్డుపై ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని వాపోయారు.కాలనీలోని వీధుల్లో కనీసం 20 విద్యుత్ దీపాలు కూడా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో చిమ్మచీకట్లతో అవస్థలుపడుతున్నామని చెబుతున్నారు. కాలనీలో పెరిగిన ముళ్లపొదలను తొలగించాలని, మంచినీరు, డ్రైనేజీ వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా పాలకులు, అధికారులు స్పందించి జగనన్న కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

మా మొర ఆలకించడం లేదు



కంచికచర్ల నుండి జగనన్న కాలనీకి సరైన రోడ్డు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో కాలు తీసి బయటపెట్టలేని దుస్థితి నెలకొంది. తమ సమస్యలపై అనేకసార్లు అధికారులకు మొరపెట్టుకున్నాం కాని పట్టించుకోవడం లేదు.

– పి.శివ, జగనన్నకాలనీ వాసి

విషపురుగులు వస్తున్నాయి



కాలనీలో కంపచెట్లు దట్టంగా పెరగడంతో రాత్రివేళల్లో విషపురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. కాలనీలో ఎటువంటి మౌలికవసతులు కల్పించకపోవడంతో అనేక ఇబ్బదులు ఎదుర్కొంటున్నాం. అధికారుల చుట్టూ తిరుగుతున్నా మా బాధలను పట్టించుకోవటం లేదు.

– లక్ష్మి, జగనన్నకాలనీ వాసి

బడికి పంపలేకపోతున్నాం



కాలనీ నుంచి కంచికచర్ల వెళ్లే గ్రావెల్‌రోడ్డు అంతా బురదకయ్యగా మారింది. రోడ్లు అధ్వాన్నంగా ఉండటంతో వర్షాకాలంలో పిల్లలను పాఠశాలలకు పంపించే పరిస్థితిలేక ఇళ్లవద్దనే ఉంచుతున్నాం. సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పద్మావతి, జగనన్న కాలనీ వాసి



తమకు వసతులు కల్పించాలంటూ సోమవారం ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ఉద్యోగుల సేవలు స్ఫూర్తిదాయకం : తన్నీరు



మేరీగ్రేస్ దంపతులను సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు



హెచ్‌ఎం విజయలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఎంపీటీసీ, గ్రామస్తులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న తాళ్లూరి మేరీగ్రేస్ సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన తాళ్లూరి మేరీ గ్రేస్ పదవీవిరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మేరీగ్రేస్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నంబూరి రవి, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకుడు ఖాదర్‌బాబు, పార్టీ పట్టణ యూత్ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, మైనార్టీ యూత్ నాయకుడు నాగుల్‌మీరా పాల్గొన్నారు.

సత్కరించిన ఎమ్మెల్యే..

మహిళా కండక్టర్ మేరీగ్రేస్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) దంపతులు హాజరయ్యారు. మేరీగ్రేస్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని వెల్లంకి ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం చెరుకూరి విజయలక్ష్మి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి హాజరై హెచ్‌ఎం విజయలక్ష్మి దంపతులను ఘనంగా సత్కరించారు. సొసైటీ మాజీ చైర్మన్ తల్లపరెడ్డి కృష్ణారెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ లంక ఆదిలక్ష్మి, వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

800 మందికి వైద్యపరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పక్కన ఎమ్మెల్యే రాజగోపాల్, మాజీఎమ్మెల్సీ జనార్దన్

వత్సవాయి: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం వత్సవాయి జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ వైద్యశిబిరానికి 800మంది హాజరుకాగా, శిబిరంలో కళ్లు, ముక్కు, చెవి, గొంతు, ఎముకలు, గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందించారు. ఫౌండేషన్ చైర్మన్ టీడీ జనార్దన్ మాట్లాడుతూ ముఖ్యంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు చేయించి కళ్లజోళ్లను కూడా అందిస్తామని వివరించారు. అనంతరం ఇటీవల పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ హెచ్‌ఎం ఎస్.అనితశ్రీ, వైద్యశిబిరాల నిర్వాహణ కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహరావు, మాజీ సర్పంచ్ టి.జగన్‌మోహన్‌రావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, చిట్టూరి రమేష్, నెల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో యోగా కీలకం



యోగా గురువు సుబ్బారావును సత్కరిస్తున్న చైర్‌పర్సన్ కృష్ణకుమారి తదితరులు

నందిగామరూరల్: మానసిక ప్రశాంతతోపాటు ఆధునిక వైద్యంలో దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో యోగా సాధన కీలక పాత్ర పోషిస్తోందని యోగా గురువు సంగెపు సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక కెవీఆర్ కళాశాల ఆవరణలో ఆదివారం రాత్రి యోగా సాధకుల ఆనందోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా యోగా తరగతుల ముగింపు సందర్భంగా ఉచితంగా తరగతులు నిర్వహించిన యోగాగురువు సుబ్బారావును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధనతో శరీరానికి కావాల్సిన స్థితిస్థాపక, రోగ నిరోధకశక్తి పెరుగుతుందని వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి మాట్లాడుతూ నెల రోజులపాటు సాధకులకు యోగా నేర్పించిన సంగెపు సుబ్బారావు అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, సామినేని శివనాగరాజు, పబ్బతి సీతారామగుప్త, మహంకాళి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు తనిఖీ

కంచికచర్ల: ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం కంచికచర్లలోని పలు మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారా అని మద్యంప్రియులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజరు, కానిస్టేబుల్ చెన్నారావు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామరూరల్: మద్యం దుకాణ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ ఎలియాజర్ హెచ్చరించారు. పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ముందుగా ఆయా దుకాణాలలోని మద్యం నిల్వలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు మద్యం దుకాణాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేసినట్లు తెలిపారు. మద్యం దుకాణాలలోని శాంపిల్స్ సేకరించి కాకినాడ పరీక్షా కేంద్రానికి పంపిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా బెల్టుషాపులకు మద్యం సరాఫరా చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

పీజీఆర్ఎస్‌కు 17 అర్జీలు

నందిగామరూరల్:ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించగా, ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ 15మంది అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి ఐదు అర్జీలు, సర్వే కోసం ఐదు, పోలీస్‌శాఖకు మూడు, మున్సిపాలిటీ ఒకటి, ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించడంతోపాటు ప్రతి అర్జీ పరిష్కారమయ్యేలా చూస్తానని వివరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు తెలిపారు. కంచికచర్లలో రోడ్ల అభివృద్ధి కోరుతూ ఓ అర్జీ, పట్టాదార్ పాసుపుస్తకం మంజూరు కోరుతూ మరో అర్జీ అందినట్లు వివరించారు. కార్యక్రమంలో డీటీ మానస, ఆర్ఐ వెంకటరెడ్డి, ఏపీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మఠం శివాలయంలో అన్నాభిషేకం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పాలేటి తీరాన వేంచేసియున్న శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం మఠం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివభగవానునికి ప్రీతిగా పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకాలు, అన్నాభిషేకం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కూటమి హామీలు మాటలకే పరిమితం

ఎంపీపీ కోటేరు లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తామన్న కూటమి నేతల హామీలు చివరికి మాటలకే పరిమితమయ్యాయని ఎంపీపీ కోటేరు లక్ష్మి ఎద్దేవా చేశారు. జుజ్జూరులోని జెల్లి ఏసోబు కల్యాణ మండపంలో సోమవారం వీరులపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2,635 మంది విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది 2,402 మంది మాత్రమే ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తగ్గటం, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు లేకపోవటంతోనే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ట్యాంకు తొలగించాలని డిమాండ్..

జయంతి గ్రామంలో నివాసగృహాలకు సమీపంలో శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకును వెంటనే తొలగించాలని ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణరెడ్డి కోరారు. ఈ ట్యాంకు ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారంటూ సమస్యను సమావేశం దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై ఎంపీపీ స్పందిస్తూ ఓవర్‌హెడ్ ట్యాంకు తొలగింపునకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

బెల్టుషాపులపై అభ్యంతరం...

గ్రామాల్లోని మద్యం బెల్టుషాపులపై ఎంపీటీసీలు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బెల్టుషాపుల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ షేక్ నాగుల్‌మీరా, సర్పంచ్‌లు పత్తిపాటి మల్లికార్జునరావు, మారపాక మహాలక్ష్మి, రమావత్ కోటి, చలమల దుర్గారావు, ఎంపీటీసీ సభ్యులు బండి సీతామహాలక్ష్మి, తోట నారాయణరావు, మొండ్రు బాయమ్మ, తమ్మిశెట్టి వరలక్ష్మి, వేమిరెడ్డి కోటేశ్వరీ, పల్లెపోగు మార్తమ్మ, మండూరి ప్రకాశరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ నీలం నాగరాజు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్టేషనరీ బహూకరణ



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయని ముండ్లపాడు సర్పంచ్ గూడపాటి లావణ్య అన్నారు.గ్రామానికి చెందిన నలజాల సుభాన్ కుమారుడు నరేష్ స్థానిక ప్రాథమిక పాఠశాల(మెయిన్), ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.65 వేల విలువ కలిగిన నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందజేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్టేషనరీ అందించిన నరేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సొసైటీ మాజీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వేల్పుల సుందరరావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి లింగయ్య. సుబ్రమణ్యస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముచ్చింతాల-తాళ్లూరు రోడ్డు గోతులమయం



ముచ్చింతాలలో రోడ్డు పరిస్థితి ఇలా



ముచ్చింతాల-తాళ్లూరు రోడ్డులో మునేరు ప్రధాన కాలువ సమీపంలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



ముచ్చింతాల సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

మండలంలోని ముచ్చింతాల నుంచి వత్సవాయి మండలం తాళ్లూరు వెళ్లే రోడ్డంతా గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో గుంతల్లో వర్షపు నీరు చేరి రోడ్డుంతా తటాకంలా మారింది. వర్షపు నీరు నిలిచి ఉండటంతో గుంతల విషయం తెలియక వాహనదారులు వాటిల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈరోడ్డులోని గుంతలను పూడ్చించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– ముచ్చింతాల(పెనుగంచిప్రోలు)